క్లుప్తంగా

ముగిసిన కారేటి గంగమ్మ కొలుపు


ప్రత్యేక అలంకరణలో కారేటి గంగమ్మ

కార్వేటినగరం: ఎగువ రాజుల కండ్రిగలో కారేటి గంగమ్మ కొలుపు బుధవారం వైభవంగా ముగిసింది. మూలవిరాట్‌కు అర్చనలు, అభిషేకాల అనంతరం అమ్మవారిని విశేషంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. సాయంత్రం మహిళలు పొంగళ్లు, పిండిదీపాలతో నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించారు. ఆ తర్వాత పొంగుపాలు తోడే కార్యక్రమం నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

సీహెచ్‌సీ వైద్యాధికారిగా శ్రీధర్



పెనుమూరు(కార్వేటినగరం): పెనుమూరు సామాజిక ఆరోగ్యకేంద్రం వైద్యాధికారిగా డాక్టర్ శ్రీధర్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇదే ఆస్పత్రిలో డాక్టర్‌గా పనిచేస్తూ ఉద్యోగోన్నతిపై ఆయన డీడీ అయ్యారు. ఆయన్ను సిబ్బంది ఆత్మీయంగా సన్మానించారు.

క్రమశిక్షణకు మారుపేరు ఎన్‌సీసీ


క్యాడెట్లను ఎంపిక చేస్తున్న అధికారులు

కార్వేటినగరం: దేశ భక్తికి, క్రమశిక్షణకు మారుపేరు ఎన్‌సీసీ అని ఆర్కేఎస్సార్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఇన్‌చార్జి హెచ్‌ఎం ఉమాశంకర్ అన్నారు. బుధవారం ఎన్‌సీసీ అధికారుల ఆధ్వర్యంలో 35వ బెటాలియన్ ప్రారంభించారు. ఇన్‌చార్జి హెచ్‌ఎం మాట్లాడుతూ, ఉన్నత పాఠశాలను ప్రారంభించి 75 ఏళ్లు కావస్తున్న శుభ సందర్భంలో ఇక్కడ ఎన్‌సీసీ ప్రారంభించి కార్వేటినగరం ప్రజల కలను సాకారం చేశారన్నారు. హిందీ టీచర్ తారకరామ ఎన్‌సీసీ విభాగానికి కేర్‌టేకర్‌గా వ్యవహరిస్తారన్నారు. ఎన్‌సీసీకి 10 మంది బాలికలు, 15 మంది బాలురను ఎంపిక చేసి జూనియర్ డివిజన్‌గా ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్యంపై దృష్టి

వడమాలపేట (విజయపురం): గ్రామీణ ప్రాంతాల్లో పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎంపీడీఓ శేషగిరిరావు అన్నారు. బుధవారం వడమాలపేట మండల పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ విజయలక్ష్మి అధ్యక్షతన నిర్వహించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ, పంచాయతీ కార్యదర్శులు బంగారు కుటుంబాల అర్హులు గుర్తింపు, పంచాయతీలలో పారిశుద్ధ్యంపై ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. తహసీల్దార్ జరీనా మాట్లాడుతూ, ప్రభుత్వ స్థలం, గుట్ట పోరంబోకు స్థలాలలో నివాసం ఉంటున్న వారు చలానా చెల్లించి రెగ్యులరైజ్ చేసుకోవచ్చన్నారు. మండలంలో భూముల రీ–సర్వే అయ్యన్నగారిపల్లెలో చేస్తామన్నారు. గ్రామాల్లో 24 గంటలు విద్యుత్ సరఫరాకు ప్రత్యేక లైన్లు ఏర్పాటు చేస్తున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ రవికుమార్ తెలిపారు. వ్యవసాయ శాఖ ద్వారా సబ్సిడీ విత్తనాలు, యూరియా పంపిణీ చేసినట్లు ఏఓ విజయకుమార్ తెలిపారు. రైతులు ఈ–క్రాప్ నమోదు చేసుకుంటేనే సబ్సిడీలు వర్తిస్తాయన్నారు. సమావేశంలో వివిధ శాఖల అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు. అనంతరం సమాచార హక్కు చట్టంపై ఎంపీడీఓ శేషగిరిరావు అవగాహన కలిగించారు.


పాలసముద్రం: పారిశుద్ధ్యం పనులను పరిశీలిస్తున్న అధికారులు

పారిశుధ్య పనుల పరిశీలన

పాలసముద్రం: గ్రామాల్లో పరిసరాల శుభ్రత బాధ్యత గ్రీన్ అంబాసిడర్లపై ఉందని ఎంపీడీఓ సతీష్ అన్నారు. బుధవారం పాలసముద్రం గ్రామ సచివాలయంలో ఆదిఆంధ్రవాడ, బీసీ కాలనీలో గ్రీన్ అంబాసిడర్లు చేస్తున్న పారిశుధ్య పనులను ఎంపీడీఓ పరిశీలించారు. కార్యక్రమంలో మండల విస్తరణాధికారి సత్యనారాయణ పాల్గొన్నారు.

తిరుమలయ్యపల్లె పంచాయతీలో..

వెదురుకుప్పం: మండలంలోని తిరుమలయ్యపల్లె పంచాయతీలో స్థానిక సర్పంచ్ భారతి ఆధ్వర్యంలో బుధవారం పారిశుధ్యం పనులను ముమ్మరంగా చేశారు. ఎంపీడీఓ పురుషోత్తం, కార్యదర్శి హరి తిరుమలయ్యపల్లె, మొరవ గ్రామాల్లో పర్యటించారు. వీధులు, రోడ్డుకిరువైపులా ఉన్న పేడ దిబ్బలు, చెత్తాచెదారాన్ని, మురుగు కాలువల్లో పేరుకుపోయిన మురుగును కార్మికులతో తొలగించారు. తాగునీటి కొళాయిల వద్ద శుభ్రం చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు రాము, మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

ఎంపీ మిథున్‌రెడ్డి అరెస్టు అక్రమం

శ్రీరంగరాజపురం: రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డి అరెస్టు అక్రమమని మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ మణి ఖండించారు. బుధవారం సమావేశం ఏర్పాటు చేసి ఆయన మాట్లాడారు. రాజకీయ కక్షతోనే ఒక పథకం ప్రకారం కూటమి ప్రభుత్వం వైఎస్సార్‌సీపీ నాయకులపై అక్రమ కేసులు బనాయించి, జైళ్లకు పంపుతోందని విమర్శించారు. ఎన్నికల హామీలను నెరవేర్చకపోవడం, ప్రజావ్యతిరేకత వస్తుండడంతో సీఎం చంద్రబాబు ప్రజల దృష్టిని మరల్చేందుకు ఇలా చేస్తున్నారని, దీనికి ప్రజలే బుద్ధి చెబుతారన్నారు. సమావేశంలో నాయకులు జనార్థన్, రామచంద్రయాదవ్, జయ, రామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.


బదిలీపై వెళ్లిన వారిని సన్మానిస్తున్న ప్రిన్సిపాల్ హేమలత, లెక్చరర్లు

వీడ్కోలు సన్మానం

పాలసముద్రం: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల నుంచి బదిలీపై వెళ్లిన ప్రిన్సిపాల్ బాలక్రిష్ణరాజు, లెక్చరర్ వినాయకం, రికార్డు అసిస్టెంట్ రాజేష్‌లకు బుధవారం ప్రిన్సిపాల్ హేమలత నేతృత్వంలో ఘనంగా వీడ్కోలు సన్మానం చేశారు. వారి సేవలను ప్రస్తుతించారు. లెక్చరర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులు పాటించండి


రైతులకు అవగాహన కల్పిస్తున్న జిల్లా వ్యవసాయ అధికారిణి లక్ష్మీప్రసన్న

కార్వేటినగరం: పంటల సాగులో రైతులు యాజమాన్య పద్ధతులు పాటించాలని జిల్లా వ్యవసాయ అధికారిణి లక్ష్మీప్రసన్న కోరారు. బుధవారం మండలంలోని ఆర్కేవీబీపేటలో రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సేంద్రియ ఎరువుల వాడితే కలిగే లాభాలను ఆమె వివరించారు. వరి సాగులో జీవన ఎరువులు మాత్రమే వాడాలన్నారు. వరి పంటకు ఆగస్టు 15వ తేదీ లోపు పంటల బీమా చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏఓ హేమలత, ఏఈఓ గాయత్రి, రైతులు పాల్గొన్నారు.

గర్భిణులకు వైద్య పరీక్షలు

పాలసముద్రం: మండలంలోని గర్భిణులు ప్రతి నెలా క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలని వైద్యాధికారి మోహన్‌క్రిష్ణ కోరారు. బుధవారం స్థానిక ఆరోగ్య ఉపకేంద్రంలో వైద్య పరీక్షలకు వచ్చిన గర్భిణులతో ఆయన మాట్లాడారు. ఎక్కువగా ఐరన్, కాల్షియం, విటమిన్స్ కలిగిన ఆహారం, ఆకుకూరలు, పాలు, గ్రుడ్లు తీసుకుంటే ఆరోగ్యవంతమైన శిశువుకు జన్మనిస్తారన్నారు. ప్రభుత్వాస్పత్రుల్లోనే కాన్పులు చేసుకోవాలని కోరారు. అనంతర గర్భిణులతోపాటు చిన్నారులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే గ్రామ సభలు


మాట్లాడుతున్న సర్పంచ్ ధనంజయవర్మ

కార్వేటినగరం: గ్రామాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించడానికే గ్రామ సభలు నిర్వహిస్తున్నట్టు కార్వేటినగరం సర్పంచ్ ధనంజయవర్మ అన్నారు. బుధవారం కార్వేటినగరంలో పంచాయతీ ఈఓ నాగరత్నమ్మ ఆధ్వర్యంలో గ్రామ సభ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, ప్రజా సమస్యలను వార్డు మెంబర్లు, కార్యదర్శులు గుర్తించి, పంచాయతీ దృష్టికి తీసుకురావాలని అప్పుడే వాటికి పరిష్కారం లభిస్తుందన్నారు. ఈఓ మాట్లాడుతూ, ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన పీ–4 సర్వేను సమగ్రంగా చేసి నిజమైన నిరుపేదలను గుర్తించాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీఓ మధుసూదన్, కార్యదర్శి సెల్వి, సచివాలయ సిబ్బంది, వార్డు పలువురు వార్డు సభ్యులు పాల్గొన్నారు.

విద్యార్థులు డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి

వడమాలపేట (విజయపురం): విద్యార్థులు డ్రగ్స్, గంజాయి, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ఈగల్ టీమ్ మండల ఇన్‌చార్జ్ కమల్ అన్నారు. బుధవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు ఈగల్ టీమ్ 'నో డ్రగ్స్..నో టెన్షన్' కార్యక్రమంపై అవగాహన కల్పించింది. విద్యార్థులు మత్తుకు బానిసలు కారాదని, చదువు తప్పితే మరే ఇతర వ్యాపకాలపై దృష్టి పెట్టరాదన్నారు. అధ్యాపకులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు



నగరి: ఎం.కొత్తూరు జెడ్పీ హైస్కూల్లో విద్యార్థులకు బుధవారం ఆరోగ్య, కంటి పరీక్షలు నిర్వహించారు. మందులు ఇచ్చారు. అలాగే దృష్టి సమస్యలు ఉన్నవారిని గుర్తించి కళ్లద్దాలకు సిఫార్సు చేశారు. హెచ్‌ఎం గీతాకుమార్, యూటీఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మునిరత్నం, వైద్యులు, వైద్య సిబ్బంది, టీచర్లు పాల్గొన్నారు.

క్షేత్రస్థాయిలో తనిఖీలు


మహిళలతో మాట్లాడుతున్న డీపీఓ

గంగాధరనెల్లూరు: జిల్లా పంచాయతీ అధికారి సుధాకర్‌రావు బుధవారం మండలంలో క్షేత్రస్థాయిలో తనిఖీ చేశారు. పలు సమస్యలపై కలెక్టరేట్‌లో జరిగే పీజీఆర్ఎస్‌లో ఇచ్చిన పలు ఫిర్యాదుల మేరకు క్షేత్రస్థాయిలో తనిఖీ నిర్వహించారు. మండల కేంద్రంలో ఎగువూరు, నెల్లెపల్లి గ్రామంలో పర్యటించి ప్రజలు ఇచ్చిన రెవెన్యూ సమస్యలు, డ్రైనేజీ నిర్మాణంపై అక్రమ కట్టడాలపై తనిఖీ చేశారు. అలాగే నెల్లెపల్లిలో స్వయం సహాయక సంఘాలు, గ్రామస్తులకు ఐవీఆర్ఎస్ కార్యక్రమంపై అవగాహన కల్పించారు. స్థానిక సర్పంచ్ సుబ్రమణ్యంయాదవ్, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పలువురు పాల్గొన్నారు.